క్లుప్తంగా

ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, సభ్యులు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో చైర్మన్‌గా రెండోసారి తోట బుచ్చిరెడ్డి, ఎక్స్ అఫీషియో సభ్యులుగా ప్రధాన అర్చకులు మహేష్‌శర్మ, కార్యవర్గ సభ్యులుగా బింగిమళ్ల హనుమాన్ కుమార్, బి మంగమ్మ, గడ్డం జగదీశ్వరరెడ్డి, ఎస్ మహాలక్ష్మి, కె లలిత, కె శ్రీదేవి, యామ చిన్నపుల్లారెడ్డిలు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి మాట్లాడుతూ తనకు రెండోసారి ఆలయ చైర్మన్‌గా అవకాశం రావడానికి సహకారించిన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ప్రత్యేక ధన్యావాధాలు తెలిపారు. ఎమ్మెల్యే, కమిటీ సభ్యుల సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ వి.కుమార్, జూనియర్ అసిస్టెంటెంట్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి

బేతంచెర్ల: మండల పరిధిలలోని ఆర్‌ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జక్కా రామయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామచంద్రుడు, సర్పంచ్ గుమ్మగాళ్ల రాజు, మాజీ సర్పంచ్ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీటీసీ నాగేషు తదితరులు రామయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

కోవెలకుంట్ల: స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. మండలంలోని జోళదరాశి గ్రామానికి చెందిన పుల్లన్న రేవనూరు వద్ద రోడ్డు దాటుతుండగా ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తరలించారు. అలాగే మండలంలోని పాట్టిపాడు సమీపంలో అదే గ్రామానికి చెందిన రమణయ్య బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొని గాయపడ్డాడు. రెండు ఘటనల్లోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు.


సిమెంట్ రోడ్డు పనుల పరిశీలన



రోడ్డు పనులు పరిశీలిస్తున్న రామ్‌కో ప్రాజెక్ట్ ప్రెసిడెంట్ రెడ్డి నాగరాజు

కొలిమిగుండ్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో చేపడుతున్న సిమెంట్ రోడ్డు పనులను రామ్‌కో సిమెంట్ ప్రాజెక్ట్ ప్రెసిడెంట్ రెడ్డి నాగరాజు సోమవారం పరిశీలించారు. ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేలా బస్టాండ్ ప్రాంగణాన్ని తీర్చిదిద్దుతున్నట్లు ఆయన చెప్పారు. బస్టాండ్‌లోని టాయ్‌లెట్లను ఆధునీకరించనున్నట్లు పేర్కొన్నారు. సీసీ రోడ్డు పనులు పూర్తి కాగానే ప్రధాన సీసీ రోడ్డుపై డివైడర్‌తో పాటు బటర్ ఫ్లై లైటింగ్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు.

పంటకోత ప్రయోగాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సుధాకర్

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ ఉప సంచాలకుల కార్యాలయంలో వ్యవసాయ సిబ్బందికి సోమవారం పంటకోత ప్రయోగాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ సుధాకర్ మాట్లాడుతూ పంటకోత ప్రయోగాల ఆధారంగానే వివిధ పంటలకు పంటలబీమా వర్తింపజేస్తామన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు సాగు చేసిన పంటల వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ నిరంజన్, ఉద్యానవనశాఖ అధికారిణి ధరిణి, అసిస్టెంట్ స్టాటిస్టికల్ అధికారి ఈశ్వరయ్య, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ప్యాపిలి: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ మండల నాయకులు శివకేశవులు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మకు వినతిపత్రం అందజేశారు. విద్యార్థినులు తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్‌ను కోరారు.

ఉప ఎన్నికలకు వేళాయె!

ఉప ఎన్నికల నగారా మోగింది. వివిధ కారణాలతో ఖాళీగా ఏర్పడిన గ్రామ పంచాయతీ సర్పంచు, వార్డు మెంబర్ల స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. అందులో భాగంగా మంగళవారం నుంచే నామినేషన్ల స్వీకరణకు శ్రీకారం చుట్టారు. ఈనెల 8 నుంచి 10 వరకు నామినేషన్ల స్వీకరణ, 11న స్క్రూటినీ, 12న అప్పీళ్లు, 13న డిస్పోజబుల్, 14న మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణ, మధ్యాహ్నం 3 తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటన ఉంటుందని ఆయా మండలాల అధికారులు ప్రకటించారు. 19న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ జరిపి విజేతలను ప్రకటించనున్నారు.

- నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- 19 న ఎన్నికల నిర్వహణ.. ఫలితాల ప్రకటన
- ఏర్పాట్లలో అధికారులు



కొలిమిగుండ్ల: మండలంలోని పలు పంచాయతీల్లో వివిధ కారణాలతో ఖాళీలు ఏర్పడిన సర్పంచ్, వార్డు మెంబర్ల స్థానాలకు ఈనెల 19న ఉప ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. కనకాద్రిపల్లె పంచాయతీ సర్పంచ్ స్థానంతో పాటు అంకిరెడ్డిపల్లె 1వ వార్డు, బెలుం 4వ వార్డు స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయన్నారు.

సంజామల: మండల పరిధిలోని ఆయా గ్రామాల వార్డు సభ్యుల పదవులకు ఈనెల 19న ఉప ఎన్ని కలు జరగనున్నాయని ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆకుమల్ల 10వ వార్డు(ఎస్సీ మహిళ), ఆల్వకొండ 1వ వార్డు (బీసీ మహిళ), పేరుసోముల 2వ వార్డు (ఎస్సీ మహిళ)లకు ఎన్నికలు జరగనున్నాయన్నారు.

కోవెలకుంట్ల: మండలంలోని వార్డుమెంబర్ల ఉప ఎన్నికకు నోటిఫికేషన్ జారీ అయినట్లు ఎంపీడీఓ రాధిక తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ కోవెలకుంట్ల, చిన్నకొప్పెర్ల, కలుగొట్ల, సొదరదిన్నె గ్రామాల్లో ఒక్కో వార్డుమెంబర్లకు ఉప ఎన్నికలు జరగనున్నాయన్నారు.

అవుకు: మండల పరిధిలో వివిధ కారణాల చేత ఖాళీగా ఉన్న సర్పంచ్, వార్డు మెంబర్ల ఎన్నికలకు నేటి నుంచి 10 వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. అన్నవరం పంచాయతీ సర్పంచ్, రామాపురం 2వ వార్డు, కొండమనాయునిపల్లె 7వ వార్డు సభ్యులకు ఎన్నికలు జరుగుతాయన్నారు.

బనగానపల్లె: మండలంలోని అప్పలాపురం 10 వ వార్డు, నందివర్గం 1వ వార్డు, రామక్రిష్టాపురం 2వ వార్డుకు మంగళవారం నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు.

బేతంచెర్ల: మండలంలోని అంబాపురం-1, రహిమాన్‌పురం-6, ఎం పెండేకల్లు 10 వ వార్డులకు ఉప ఎన్నిక నిమిత్తం మంగళవారం నుంచి నామినేషన్లు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ వెంగన్న తెలిపారు.

ముగిసిన చండీయాగం



మౌనవ్రతం చేస్తున్న పీఠాధిపతి శ్రీ శంభుసోమనాథ్ శివాచార్యులు

బనగానపల్లె రూరల్: కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా సుల్తానాపురం గ్రామంలోని పంచాక్షరి మహాసంస్థాన తీర్థ బ్రహన్మఠం పీఠాధిపతి శంభు సోమనాథ్ శివాచార్యులు యాగంటి క్షేత్ర సమీపంలో వెలసిన పార్వతీదేవి మారుసీళ్ల చెలిమ ఆలయం వద్ద పది రోజులుగా చేపట్టిన చండీయాగ మౌన వ్రతం సోమవారం పూర్ణహుతితో ముగిసింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు హోమం వద్ద మౌనం పాటించారు. పూర్ణహుతి అనంతరం మౌనవ్రత దీక్షను విరమించారు. హోమం సందర్భంగా కర్ణాటకతో పాటు మండలంలోని పరిసర గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో పార్వతిదేవి ఆలయ నిర్వాహకులు రామక్రిష్టారెడ్డి, సర్పంచ్ మహేశ్వరరెడ్డి, యాగంటి ఆలయ మాజీ చైర్మన్ బత్తుల బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రలను సద్వినియోగం చేసుకోండి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి

అవుకు: ఒకటి నుంచి 19 ఏళ్లలోపు వున్న వారందరూ అల్బెండజోల్ మాత్రలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి సూచించారు. ఈనెల 10న నిర్వహించనున్న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయ భవనంలో సోమవారం పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కడుపులో నులి పురుగులు ఉండటం వలన పోషకాహార లోపం, రక్తహీనత ఏర్పడటమేగాక శారీరక, మానసిక ఎదుగుదలలో లోపాలు వస్తాయన్నారు. నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలను వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్ వినోద్‌కుమార్, ఎంఈఓ శ్రీధర్‌రావు, ఈఓఆర్‌డీ రామక్రిష్ణవేణి, హెల్త్ సూపర్‌వైజర్లు మల్లేశ్వరి, కమాల్ సాహెబ్, వేణుగోపాలరాజు, దానమ్మ, తెరిసమ్మ, సీహెచ్‌ఓలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సెయింట్ జోసఫ్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం గీతా

కోవెలకుంట్ల: స్థానిక సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి షూటింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గీతా తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజుల క్రితం నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన తీతు, విజయ్‌చరణ్ సత్తా చాటారన్నారు. త్వరలో నెల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలను హెచ్‌ఎంతోపాటు ఫిజికల్ డైరెక్టర్ హర్ష, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల అధ్యాపకులు

‘శ్రీసుధ’ విద్యార్థులు

డోన్: ఈనెల 6న నంద్యాల ఎస్‌పీజీ ఉన్నత పాఠశాలలో జరిగిన షూటింగ్‌బాల్ ఎంపిక పోటీలలో తమ స్కూల్ విద్యార్థులు అఖిలేష్, వేణుగోపాల్, రవిశంకర్, విష్ణు ప్రతిభ జనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని స్థానిక శ్రీసుధ పాఠశాల డైరెక్టర్ సుదర్శన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈనెల 11 నుంచి 13వ తేదీ వరకు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జరిగే రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొంటారన్నారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ నూర్‌అహ్మద్ అభినందించారు.

కరాటే పోటీల్లో డోన్ విద్యార్థుల ప్రతిభ



విజేతలతో స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ సభ్యులు

డోన్: ఇటీవల విశాఖపట్నం స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో డోన్ విద్యార్థులు పలు విభాగాల్లో పతకాలు సాధించినట్లు కోచ్ రమణ తెలిపారు. స్పోర్ట్స్ కరాటే డు అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో డోన్ పట్టణానికి చెందిన రామ్ స్కూల్ ఆఫ్ కరాటే పోటీల్లోని కటా విభాగంలో స్వాతిరెడ్డి, తన్విరెడ్డి ద్వితీయ, తృతీయ స్థానం, అమిత్ శ్రీరాం తృతీయస్థానం, కుమితి విభాగంలో దేవాన్ష్, శ్రీరాం, రిజ్వాన్, హేమంత్, రాజేష్ సింగ్‌లు ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారన్నారు. విజేతలను స్పోర్ట్స్ కరాటే డు అసోసియేషన్ ఏపీ అధ్యక్షులు మిల్టన్ శాస్త్రి, అసోసియేషన్ టెక్నికల్ డైరెక్టర్ కలైమణిలు అభినందించారు.

గద్దర్ మృతికి నివాళి



బనగానపల్లెలో గద్దర్ చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కోవెలకుంట్ల: ప్రజా గాయకుడు గద్దర్ మృతిపట్ల ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నివాళులర్పించారు. సంఘాల ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు కరుణాకర్‌రావు, జీఎల్ నరసింహులు, తదితర సభ్యులు గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కార్మిక, కర్షక పీడిత వర్గాల పక్షాన అనేక పోరాటాలు చేశారన్నారు. జన నాట్య మండలి స్థాపించి తన పాటల ద్వారా ప్రజలను చైతన్యం చేశారన్నారు.

బనగానపల్లెలో..

బనగానపల్లె రూరల్: గద్దర్ మృతికి బనగానపల్లె పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ, ఏఐటీయూసీ, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘన నివాళి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా నాట్యమండలి నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య మాట్లాడుతూ గద్దర్ తన ఆటపాటలతో ప్రజలను చైతన్యం చేస్తూ ప్రభుత్వాల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారన్నారు. ఇలాంటి విప్లవవీరుడు, ఉద్యమ కెరటం గద్దర్‌ను కోల్పోవడం దురదృష్టకరమన్నారు. ఆయన ఆశాయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అంతకుముందు గద్దర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సుబ్బారెడ్డి, గిరిజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు కాలింగ్ రాముడు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పెద్ద మునెయ్య, సంజీవులు, నాగరాజు, సుబ్రమణ్యం, శ్రీనివాసులు, ఎర్రన్న, పెద్దయ్య, జంబయ్య తదితరులు పాల్గొన్నారు.

డోన్‌లో..

డోన్ టౌన్: ప్రజా విప్లవ గాయకుడు గద్దర్ మృతి తీరని లోటని సీపీఐ, ప్రజానాట్యమండలి నాయకులు అన్నారు. స్థానిక కార్యాలయంలో గద్దర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి పులిశేఖర్, ప్రజా నాట్య మండలి జిల్లా అధ్యక్షులు వాసు మాట్లాడుతూ ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప కళాకారుడు గద్దర్ అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు నారాయణ పాల్గొన్నారు. అలాగే జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాయలంలో గద్దర్ మృతి పట్ల జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏఈ నాగరాజు ఆధ్వర్యంలో గద్దర్ చిత్ర పటానికి నివాళులర్పించారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి అవకాశాలు



కంప్యూటర్లను పరిశీలిస్తున్న దృశ్యం

డోన్ టౌన్: విద్యారులకు వృత్తి విద్య కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలు అధికంగా ఉంటాయని పాతపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఐదు కంప్యూటర్లు, ప్రింటర్‌ను సోమవారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో పాఠశాలలో అమర్చి పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందితే జీవితంలో ఉపాధి రంగంలో రాణించగలుగుతారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.వృత్తి విద్యా కోర్సు శిక్షకులు అల్లిపీరా, మహేష్, ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, శివప్రసాద్, వెంకటరమణ, లక్ష్మయ్య, బాబు, ప్రసాద్‌రావు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న దృశ్యం

డోన్: మునిసిపల్ పరిధిలోని 32 వార్డులలో మౌలిక వసతుల కల్పన పనులు శరవేగంగా జరుగుతున్నాయని మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ వెంకట్రామిరెడ్డిలు తెలిపారు. సోమవారం పట్టణంలోని 30, 15వ వార్డులలో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను వారు పరిశీలించారు. వారి వెంట మునిసిపల్ డీఈ రసూల్, ఏఈ సురేష్, కౌన్సిలర్లు ఆర్జ రమణ, సుకన్య,నాయకులు భాస్కర్, మహేష్ ఉన్నారు.





గూటుపల్లె సమీపంలో నారుమడిని సిద్ధం చేస్తున్న రైతు, వరినారు వేస్తున్న కూలీలు, ఆర్ బుక్కాపురం సమీపంలో ట్రాక్టర్‌తో నారు మడిని సిద్ధం చేస్తున్న రైతు

వ్యవసాయ పనుల్లో రైతన్న బిజీ

బేతంచెర్ల: మండలంలోని యంబాయి, శంకలాపురం, గూటుపల్లె, ఆర్‌ఎస్ రంగాపురం, ముద్దవరం, హెచ్ కొట్టాల, గోరుమానుకొండ తదితర గ్రామాల పరిధిలోని బోరుబావుల కింద వరి నారు నాటేందుకు మడులను ట్రాక్టర్లు, ఎడ్లతో రైతన్నలు సిద్ధం చేస్తుండగా వ్యవసాయకూలీలు వరి నాటు వేస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి నేటి వరకు సమృద్ధిగా వర్షాలు పడుతుండటంతో రైతన్నలు బోరుబావుల కింద జోరుగా వరి, ఉల్లి నాట్లు వేస్తూ బిజీగా ఉన్నారు.

అన్నదానం

డోన్ టౌన్: అకాల మరణం చెందిన కానిస్టేబుల్ సురేంద్రనాథ్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఎస్‌ఐ శివశంకర్ సోమవారం పట్టణంలోని పలు చోట్ల అన్నదానం చేశారు. ఎస్‌ఐ శివశంకర్, నంద్యాలకు చెందిన కానిస్టేబుల్ సురేంద్రనాథ్ గతంలో ఓర్వకల్లు ఎయిర్ పోర్టులో పనిచేశారు. అప్పుడు ఇద్దరూ మంచి స్నేహితులుగా ఉండేవారు. ఏడాది క్రితం కానిస్టేబుల్ మరణించడంతో ఆయన వర్ధంతిని పురస్కరించుకుని స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన కూడళ్లతో పాటు రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో యాచకులకు ఎస్‌ఐ అన్నదానం చేశారు.

రేపు రోడ్డు ప్రారంభం

డోన్: మండలంలోని కొత్తకోట గ్రామం వద్ద 44 వ జాతీయ రహదారి నుంచి కొత్తబురుజు గ్రామం వరకు నిర్మించిన తారు రోడ్డును బుధవారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రారంభించనున్నారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం వారు కొత్తకోట గ్రామంలో ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడా రు. రోడ్డును ప్రారంభించిన అనంతరం కొత్తకోట గ్రామం నుంచి నక్కలవాగు పల్లె, తిరునాం పల్లి, కొట్రాయిల మీదుగా కొత్త బురుజు గ్రామం వరకు మంత్రి పాదయాత్ర చేస్తారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ రామచంద్రుడు, పీఆర్ డీఈఈ రామకృష్ణారెడ్డి, ఏఈ నారాయణ పాల్గొన్నారు.

14న యాగంటి క్షేత్రంలో బహిరంగ వేలాలు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో ఈనెల 14న బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తోట బుచ్చిరెడ్డిలు సోమవారం తెలిపారు. వేలాలు ఆలయ ఆవరణంలో టెంకాయలు విక్రయించుకునే హక్కు, పండ్లు, బొమ్మల అంగడి, ఐస్‌క్రీం విక్రయించుకునే హక్కుల కోసం బహిరంగ వేలం పాటు నిర్వహిస్తున్నామని, వేలంలో పా ల్గొనేవారు డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రహదారుల ఏర్పాటుతోనే గ్రామాల అభివృద్ధి

బేతంచెర్ల: రహదారుల ఏర్పాటుతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బలపాలపల్లె గ్రామం నుంచి కొలుములపల్లె గ్రామం మీదుగా బుగ్గానిపల్లె గ్రామం వరకు రూ.5.32 కోట్లతో నిర్మించిన రహదారిని పీఐయూ డీఈ రమేష్‌కుమార్ రెడ్డి, ఏఈ జాకీర్ హుస్సేన్, గ్రామ సర్పంచ్ చిన్న మద్దమ్మతో కలిసి ఎంపీపీ పరిశీలించారు. అనంతరం కొలుములపల్లె గ్రామంలో నిర్మిస్తున్న గ్రామ సచివాలయం, రైతు భరోసా, హెల్త్ క్లినిక్ భవనాలను పరిశీలించారు. వారివెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఎద్దులన్న, రామనాయుడు ఉన్నారు.

ఘనంగా కొడిపీర్ల వేడుకలు

డోన్: పట్టణంలోని పలు చావిళ్లలో కొడుపీర్లు కొలువయ్యాయి. కొండపేటలోని బంగారయ్య వీధిలో దస్తగిరి స్వామి పీర్లచావిడిలో మొహరం వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. పెద్దసరిగెత్తు సందర్భంగా సోమవారం వార్డు కౌన్సిలర్ దినేష్‌గౌడ్ ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులు సోమవారం స్వామివారికి పూల షేర్వాలు, షెద్దర్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్రైం కార్నర్

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అవుకు: పట్టణంలోని ఆంజనేయస్వామి టెంపుల్ ఏరియాలో ఓ వ్యక్తి సోమవారం క్రిమీసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన వినయ్‌కుమార్ కుటుంబ కలహాలతో క్రిమిసంహారక మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి నుంచి బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

కోలుకోలేక మహిళ మృతి

బేతంచెర్ల: మండల పరిధిలోని యంబాయి గ్రామానికి చెందిన చిక్కా పరమేశ్వరప్ప భార్య పుష్పావతమ్మ (46) కడుపు నొప్పి తాళలేక గత నెల 26న పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం మృతి చెందింది. మృతురాలి భర్త చిక్కా పరమేశ్వరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ లింగమయ్య తెలిపారు.

బైకులు ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

వెల్దుర్తి: స్థానిక హైవే-44పై పాత షరీఫ్‌డాబా సమీపంలో ముందు వెళ్తున్న బైక్‌ను వెనుక వస్తున్న బైక్ ఢీకొనడంతో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. హైవే పోలీసులు తెలిపిన వివరాలు.. కల్లూరు మండలం కొంగనపాడు రామాంజనేయులు మామిడి పండ్ల వ్యాపారి. బైక్‌పై గోవర్ధనగిరి వెళ్లి తిరిగి వస్తుండగా ఇతని బైక్‌ను వెనక వచ్చిన కృష్ణారెడ్డి అనే వ్యక్తి బైక్ ఢీకొంది. ప్రమాదంలో రామాంజనేయులుకు తీవ్ర గాయాలయ్యాయి. కృష్ణారెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. 108 సిబ్బంది క్షతగాత్రులను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా అంబులెన్స్ కర్నూలు చేరుకోగానే కృష్ణారెడ్డి దిగి పరారైనట్లు సమాచారం.

మద్యం విక్రేత అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామానికి చెందిన ఈడిగ శివనాగేంద్రగౌడు బేతంచెర్ల పట్టణం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తుండగా అరెస్ట్ చేశామని ఎస్‌ఐ శివశంకర్ నాయక్ తెలిపారు. అతని వద్ద నుంచి 9 మద్యం క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ అదృశ్యం

బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్ కాలనీకి చెందిన రామతీర్థం శంకరమ్మ అదృశ్యమైనట్లు పోలీసులు సోమవారం కేసు నమోదు చేసుకున్నారు. శంకరమ్మ ఈనెల 3న రాత్రి 7 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్ల వద్ద, పలు ప్రాంతాల్లో గాలించినా ఆచూకీ తెలియకపోవడంతో భర్త వెంకటసుబ్బయ్య పోలీసులను ఆశ్రయించాడు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ఎంవీ రమణ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

వెల్దుర్తి: మండల పరిధిలోని ఎల్ నగరం గ్రామానికి చెందిన రేవతి సోమవారం ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను పుట్టింటికి పంపేందుకు భర్త నిరాకరించడంతో క్షణికావేశానికి లోనై ఇంట్లో ఉన్న ఎనామిల్ పెయింట్ తాగింది. హుటాహుటిన వెల్దుర్తి ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వ్యక్తికి జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామిరెడ్డిగారి రాంభూపాల్‌రెడ్డి సోమవారం జైలు శిక్ష విధించారని కోర్టు పోలీసులు తెలిపారు. వివరాలు.. షేక్ మాబాషా ఆదివారం టెక్కె సుంకులమ్మ వీధిలో రాత్రి సమయంలో దారిన పోయే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో స్థానికులు టూటౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా రెండు రోజులు జైలుశిక్ష విధించారని చెప్పారు.

వలంటీర్ ఆత్మహత్య

రుద్రవరం: మండలంలోని హరినగరం గ్రామానికి చెందిన వలంటీర్ వెంకటయ్య (35) సోమవారం ఇంట్లో పైకప్పుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాలనీ వాసులు తెలిపిన వివరాలు .. మూడేళ్లుగా భార్యభర్తలు విడివిడిగా జీవనం సాగిస్తున్నారు. భార్య కాపురానికి రాకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. మూడేళ్లు దాటినప్పటికీ ఆమె తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురై అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ కొత్తపల్లె గ్రామ సమీపాన ఉన్న బలపం గనుల వద్ద పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్‌ఐ శివశంకర్ నాయక్ తెలిపారు. బేతంచెర్ల, హెచ్ కొట్టాల, ఆర్‌ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన 8 మంది పేకాట ఆడుతుండగా అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.51 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేగంగా ప్రభుత్వ భవన నిర్మాణాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో ప్రభుత్వ భవన నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయి. రూ.1.30 కోట్లతో జెడ్పీ హైస్కూల్ భవనం, రూ.17.50 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు కొనసాగుతున్నాయి. గ్రామ సచివాలయం, ఆర్బీకే, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, జెడ్పీ హైస్కూల్ ఒకే చోట నిర్మిస్తుండటంతో గ్రామానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

జాతీయ రహదారి పనులు..

ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో ఓర్వకల్లు మండలం సోమయాజులపల్లె నుంచి బేతంచెర్ల మండలం మీదుగా డోన్ వరకు 56 కిలోమీటర్లతో రూ.630 కోట్లతో జాతీయ రహదారి మంజూరైంది. జాతీయ రహదారి నిర్మాణ పనులు ప్రస్తుతం ఆర్‌ఎస్ రంగాపురం, ఆర్ కొత్తపల్లె గ్రామాల మీదుగా కొనసాగుతున్నాయి.

శాంతి ర్యాలీ



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బనగానపల్లె: మణిపూర్‌లో శాంతి నెలకొనాలని సోమ వారం వివిధ ప్రజా సంఘాలు, క్రిష్టియన్ సేవకుల ఆధ్వర్యంలో పట్టణంలో నుంచి అవుకు మెట్ట సర్కిల్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ ఘటన బాధ్యులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు శాంతి ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ వెంకటేశ్వర్లకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు కెడం సుబ్బరాయుడు, సీపీఎం నాయకులు కె.రాముడు, పెద్దముని తదితరులు పాల్గొన్నారు.